క్లుప్తంగా

చురుగ్గా ఆస్పత్రి అభివృద్ధి పనులు



నిర్మాణంలో మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రి

మాడుగుల: పట్టణంలో 30 పడకల ఆస్పత్రి పనులు చురుగ్గా సాగుతున్నాయి. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషి ఫలితంగా ఈ ఆస్పత్రి అభివృద్ధికి రూ 5.50 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో కార్పొరేట్‌కు దీటుగా నిర్మాణ పనులు సాగుతున్నాయి. దాదాపు పనులు పూర్తి కావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దేవాపురం, కంకి, సీతబందల, గరికిబంద, తదితర పది గిరిజన గ్రామాలు, చీడికాడ మండలం కోనాం పంచాయతీ పరిధిలోని 12 గ్రామాలు, మాడుగుల మండలంలో 56 గ్రామాలకు చెందిన నిరుపేదలకు ఈ ఆస్పత్రి ఆధారం కానుంది. దీంతో ఈ ప్రాంత గిరిజనులు డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

కాలువల్లో పూడిక తీయించాలని వినతి



మండల ప్రత్యేకాధికారికి వినతిపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు యాదగిరిదాసు

రోలుగుంట: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని దళిత సేవా పరిరక్షణ జిల్లా అధ్యక్షుడు యాదగిరి దాసు కోరారు. ఈ మేరకు మండల ప్రత్యేకాధికారి ప్రసాదరావుకు ఆయన శనివారం వినతి పత్రం అందజేశారు. కాలువల్లో పూడిక పేరుకు పోయిందన్నారు. అసలే వ్యాధుల ప్రబలే సీజన్ కావడంతో దోమల విజృంభిస్తున్నాయన్నారు. దోమకాట్లతో కొన్ని గ్రామాల్లో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. వెంటనే కాలువలను వీధులను శుభ్రపరిచే చర్యలు తీసుకోవాలని కోరారు.

గుల్లేపల్లిలో 68 మందికి వైద్య పరీక్షలు

కె.కోటపాడు: గుల్లేపల్లిలో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం 68 మంది రోగులను పరీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలతోపాటు జాగ్రత్తలను వివరించారు. హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


12 అడుగుల గిరినాగు హతం



స్థానికులు హతమార్చిన గిరినాగు

నాతవరం: మాధవనగరం పంచాయతీ శివారు గంటావారి కొత్తగూడెంలో శనివారం 12 అడుగుల గిరినాగు పామును రైతులు హత మార్చారు. గ్రామానికి చెందిన రాజాన బాబూరావు తన పొలంలో కాయకూరలు కోసేందుకు వెళ్లగా, పొదల్లోంచి బుసలు కొడుతూ కనిపించింది. వెంటనే చుట్టుపక్కల రైతులకు సమాచారం ఇవ్వడంతో గిరినాగును హతమార్చారు. ఈ ప్రాంతంలో ఇంత పెద్ద పాము కనిపించడంతో చూసేందుకు చుట్టు పక్కల వారు అధికంగా వచ్చారు.

ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ తగదు



కె.కోటపాడులో మాట్లాడుతున్న నాయినిబాబు

కె.కోటపాడు: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు గండి నాయినిబాబు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై తీసుకుంటున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలన్నారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయడంతోపాటు పోలవరం నిర్మాణం పూర్తికి నిధులతోపాటు నిర్వాసితులకు పరిహారాన్ని వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి యర్రా దేముడు, దేముడమ్మ, వనుము సూర్యనారాయణ పాల్గొన్నారు.

కారుణ్యంతో ప్రపంచాన్ని జయించొచ్చు

- పూర్వ వీసీ ముర్రు ముత్యాలనాయుడు
- ఘనంగా మదర్ థెరిసా 114వ జయంతి



గొలుగొండ: మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న చిన్నారులు



కె.కోటపాడు: మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేస్తున్న పూర్వ వీసీ ముర్రు ముత్యాలనాయుడు



దేవరాపల్లి: మదర్ థెరిసా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు

కె.కోటపాడు: కారుణ్యంతో ప్రపంచాన్ని జయించవచ్చునన్న మదర్ థెరిసా వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ పూర్వ వీసీ ముర్రు ముత్యాలనాయుడు అన్నారు. కె.కోటపాడులోని ఓ విద్యా సంస్థలో శనివారం ఆయన మదర్ థెరిసా 114వ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. విదేశస్తురాలైన ఆమె భారతదేశంలో ఉన్న వారికి ఎనలేని సేవ చేసిందన్నారు. సేవ, ప్రేమను పంచేందుకు సరిహద్దులు లేవని చాటిచెప్పిన త్యాగమూర్తి మదర్ థెరిసా అన్నారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిం, అధ్యాపకులు పాల్గొన్నారు.

మానవ సేవకు అంకితమైన మదర్ థెరిసా

నర్సీపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ థెరిసా 114వ జయంతి ఘనంగా నిర్వహించారు. గ్రంథపాలకురాలు పి.దమయంతి, పాఠకులతో కలిసి మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. మదర్ థెరిసా తన జీవితాన్ని మానవ సేవకు అంకితం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.ప్రభాకరరావు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్...

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో మదర్ థెరిసా జయంతి నిర్వహించారు. క్లబ్ ఉపాధ్యక్షుడు కామిరెడ్డి సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ మురళీ, గోవింద్, ఎం.వి.రంగారావు, పి.శ్రీనువాసరావు మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మదర్ థెరిసాను ఆదర్శంగా తీసుకోవాలి

గొలుగొండ: సేవా మార్గంలో ప్రపంచంలో ప్రతి ఒక్కరూ మదర్ థెరిసాను ఆదర్శంగా తీసుకోవాలని గ్రంథపాలకుడు రాజుబాబు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో శనివారం మదర్ థెరిసా జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలతో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

మదర్ థెరిసా సేవా మార్గం స్ఫూర్తిదాయకం

దేవరాపల్లి: మానవత్వానికి నిలువెత్తు రూపం మదర్ థెరిసా అని, సేవా మార్గం చూపిన మహనీయురాలి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలని గ్రంథపాలకుడు ఓ. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మదర్ థెరిసా 114వ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు, రిటైర్డ్ ఉద్యోగి గొల్లు రామమూర్తి మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక యువకులు, పాఠకులు పాల్గొన్నారు.



తామరంలో థెరిసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న హరిబాబు, తదితరులు



నర్సీపట్నం: మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేస్తున్న గ్రంథాలయ అధికారి దమయంతి, పాఠకులు

తామరంలో...

మాకవరపాలెం: తామరంలో మదర్ థెరిసా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడి సచివాలయం వద్ద మదర్ థెరిసా విగ్రహానికి తూర్పుకాపు సంఘం మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. థెరిసా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రసాద్, మాజీ ఉప సర్పంచ్ శ్రీను, వైఎస్సార్‌సీపీ నేత దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

కాలనీ ఇళ్లకు ఉచిత విద్యుత్ మీటరు, కుళాయి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి లక్ష్మి

మరుగుదొడ్డి, ఇంకుడు గుంతకు అదనంగా రూ.18 వేల మంజూరు



జంపెన లేఅవుట్‌లో లబ్ధిదారులుతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

నాతవరం: జగనన్న లేఅవుట్లలో ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి నిర్మాణానికి అదనంగా రూ.12 వేలు, ఇంకుడు గుంతకు రూ.6వేలు ఇస్తున్నామని మండల ప్రత్యేకాధికారి జి.వి.లక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. నిర్మాణం పూర్తి చేసిన ప్రతి ఇంటికి ఉచితంగా విద్యుత్ మీటరు, తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేసి, మిగిలిన వారిని చైతన్యవంతం చేయాలన్నారు. ఈ నెలాఖరుకు శత శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. వచ్చే నెలలో ప్రభుత్వం గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పోలుపర్తి పార్థసారథి, హౌసింగ్ జేఈ జోగారావు, ఉపాధి ఏపీవో చిన్నారావు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చినబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ నిర్వహణ భేష్

మాడుగుల: జంపెన అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ బాగుందని మండల ప్రత్యేకాధికారి జి. ప్రభాకరరావు కితాబిచ్చారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం ఆయన జగన్న లేఅవుట్ల సందర్శనలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో నాడు – నేడు పనులు పరిశీలించారు. జగనన్న లేఅవుట్ల ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. రానున్న కాలంలో జగన్న కాలనీలకు మరిన్ని సదుపాయాలు కల్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ లెక్కల సత్యనారాయణ, సర్పంచ్ నేమాల గురువునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెచ్చేటి శ్రీను, శివాజీ , అంగన్‌వాడీ కార్యకర్త హైమావతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలలో కాచి చల్లార్చిన నీళ్లు

ఎంఈవో జానుప్రసాద్ ఆదేశం



హెచ్‌ఎం వరప్రసాద్‌తో మాట్లాడుతున్న ఎంఈవో జానుప్రసాద్

రోలుగుంట: మధ్యాహ్న భోజనం సరఫరా వద్ద విద్యార్థులకు కాచి చల్లార్చిన నీళ్ల విధిగా ఏర్పాటు చేయాలని ఎంఈవో జానుప్రసాద్ నిర్వాహకులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ విద్యా విధానాన్ని పరిశీలించారు. పలు ప్రశ్నల వేసి విద్యార్థుల విద్యా సామర్థాలను తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ అమలుపై ఆరా తీశారు. రుచిశుచితో వేడి ఆహారాన్ని అందించాలన్నారు. పాఠశాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

అభివృద్ధి పనులకే ఇసుక తరలింపు

తహసీల్దార్ లక్ష్మి, ఎస్‌ఐ నాగేంద్ర



మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మి, ఎస్‌ఐ నాగేంద్ర

దేవరాపల్లి: మండలంలో అభివృద్ధి పనులకు నిబంధనలకు లోబడి శారదా నది నుంచి ఇసుక తరలింపునకు అనుమతులు ఇస్తున్నామని తహసీల్దార్ ఎం. లక్ష్మి, ఎస్‌ఐ డి. నాగేంద్ర స్పష్టం చేశారు. శారదా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారంటూ వచ్చి ఆరోపణలు, కొన్ని పత్రికలతోపాటు సోషల్ మీడియాలో వచ్చిన కథనాలపై వారు స్పందించారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడారు. మండలంలో అభివృద్ధి పనులతోపాటు జగనన్న కాలనీల్లోను, సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారులకు ఇసుక తరలింపునకు టోకెన్లు జారీ చేస్తున్నామన్నారు. ఎక్కడైనా అక్రమంగా ఇసుక తరలిస్తూ మొదటి సారి పట్టుబడితే రూ.10 వేలు, రెండో సారి రూ.20 వేలు అపరాధ రుసుం విధిస్తామని, మూడో సారి పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు

వ్యక్తిత్వ వికాస నిపుణుడు సురేష్



వ్యక్తిత్వ వికాస నిపుణుడు సురేష్‌ను సత్కరిస్తున్న హెచ్‌ఎం సుందరి, ఉపాధ్యాయులు

దేవరాపల్లి: సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదవడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు సురేష్ అన్నారు. హెచ్‌ఎం పిబిటి. సుందరి అధ్యక్షతన శనివారం కాశీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో «వ్యక్తిత్వ వికాస అభివృద్ధి»పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, ఆరోగ్య సూత్రాలు, పదో తరగతిలో గరిష్ట మార్కులు సాధించేందుకు అవసరమైన మెలకువలను వ్యక్తిత్వ వికాస నిపుణుడు సురేష్ తెలియజేశారు. శ్రమ మీ ఆయుధమైతే, విజయం మీ బానిసై చెంత మోకరిల్లుతుందన్నారు. అనంతరం ఆయన్ను ఉపాధ్యాయులు సాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ రిసోర్స్ పర్సన్ కె. రాంబాబు, ఉపాధ్యాయులు జి. సుజాత, రాము, పూర్ణిమ, సూర్యకాంతం, దేవరాపల్లి వాసవీ క్లబ్ సభ్యుడు వెత్సా గుప్తా పాల్గొన్నారు.

గొలుగొండలో భారీ వర్షం

గొలుగొండ: మండలంలో శనివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దాదాపు మూడు గంటల పాటు కురిసిన జోరు వర్షంతో దారగెడ్డ, బోరింగ్ గెడ్డ పొంగి ప్రవహించాయి. ఈ వర్షంతో దారగెడ్డ ప్రాంతంలో వేసిన వరినాట్లకు ఊపిరి పోసింది. నెల రోజులుగా తీవ్ర ఎండలకు వరితోపాటు సరుగుడు, చెరకు, ఆగాకర పంటలు ఎండిపోతున్నాయి. దాంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళనకు గురైన నేపథ్యంలో తాజాగా కురిసిన వర్షం ఎంతో మేలు చేసిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే వర్షం అడపాదడపా కురిస్తే పంటలకు సాగునీరు ఢోకా ఉండదని చెబుతున్నారు.

అభివృద్ధి పనులకు ఇసుక తరలిస్తే ఆరోపణలా?

- ఓర్వలేక డిప్యూటీ సీఎం బూడిపై విమర్శలు
- ప్రతిపక్షాలపై వైఎస్సార్‌సీపీ దేవరాపల్లి నాయకులు ధ్వజం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ కర్రి సత్యం, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, బూరె బాబూరావు

దేవరాపల్లి: గత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేస్తోందని, దీనికోసం అధికారుల అనుమతితో ఇసుక తరలిస్తే ప్రతిపక్ష పార్టీ నాయకులు నిరాధార ఆరోపణలతో రాద్ధాంతం చేయడం సిగ్గు చేటని వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక రైవాడ జలాశయం అతిథి గృహంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తదితరులు మాట్లాడారు. మాడుగుల నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని వారంతా ఒక్కటై నిరాధార ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా, కుట్రలు, కుయుక్తులు పన్నినా 2024లో ముత్యాలనాయుడు విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరన్నారు. డిప్యూటీ సీఎం సొంత మండలం దేవరాపల్లిలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీ నాయకులు, ఎల్లో మీడియా చేస్తున్న ఆరోపణలను తామంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు. సీఎం జగన్ సహకారంతో మునుపెన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా ప్రభుత్వ భవనాలు, జలజీవన్ మిషన్ పనులతోపాటు యజ్ఞంలా రోడ్లు, సీసీ డ్రైనేజీలు, జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఈ అభివృద్ధి పనులకు జీవో నంబరు 32కు లోబడి స్థానిక అధికారుల అనుమతితో ఇసుక తరలిస్తే అక్రమ రవాణా ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఈ అభివృద్ధి పనులన్నీ పూర్తయితే తమ అడ్రస్ గల్లంతవుతుందనే భయంతోనే చౌకబారు విమర్శలు చేస్తున్నారన్నారు. జిల్లా, నియోజకవర్గం దాటి ట్రాక్టర్లపై ఇసుక తరలిస్తున్నట్లు దమ్ముంటే నిరూపించాలని సవాల్ విసిరారు. నీతి నిజాయితీకి మారుపేరుగా నిలిచే తమ నాయకుడికి ఇసుక అక్రమ రవాణాకు వత్తాసు పలకాల్సిన గత్యంతరమేమి లేదన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి అడ్డుకుంటున్న ప్రతిపక్ష నాయకులకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో తిమిరాం, కలిగొట్ల, వెంకటరాజుపురం సర్పంచ్‌లు రెడ్డి సూర్యనారాయణ, గొర్రుపోటు సుధారాణి, దాసరి సంతోష్‌కుమార్, తెనుగుపూడి, తామరబ్బ ఉప సర్పంచ్‌లు కాటిపాం పెదనాయుడు, గుమ్మడపు మహేష్, పార్టీ నాయకులు కొమ్మినేని సన్యాశినాయుడు, పరవాడ వెంకటరావు పాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి

పంచాయతీరాజ్ శాఖ ఈఈ నగేష్‌బాబు



చెర్లోపాలెంలో ఆర్బీకే భవనాన్ని పరిశీలిస్తున్న పీఆర్ ఈఈ నగేష్‌బాబు



గుమ్మడిగొండలో పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచనలు చేస్తున్న పీఆర్ ఈఈ నగేష్‌బాబు

నాతవరం: నూతన భవన నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఈఈ నగేష్‌బాబు ఆదేశించారు. మండలంలో చెర్లోపాలెం, వల్సంపేట, ఎం.బెన్నవరం, గుమ్మడిగొండ పంచాయతీల్లో సచివాలయ, ఆర్బీకే, హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. నాణ్యత ప్రకారం పనులు చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంతరకు పనులు పూర్తి చేసిన భవనాలకు బిల్లుల చెల్లింపులు చేశామన్నారు. మొదట్లో కరోనా కారణంగా బిల్లుల చెల్లింపుల్లో జాప్యమైందన్నారు. ప్రస్తుతం భవన నిర్మాణాలు చేసిన వాటిని సకాలంలో చెల్లింపులు చేస్తున్నామన్నారు. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కలెక్టరు ఆదేశాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణాలు వచ్చే నెలాఖరుకు పూర్తి చేయాలని, ఆ విషయంలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. పనులు చేసే కాంట్రాక్టర్లకు క్షేత్రస్థాయి సిబ్బంది సహకారం పూర్తిగా ఉంటుందన్నారు. స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు సైతం పనులు సకాలంలో పూర్తి చేసేందుకు సహకారం అందించాలన్నారు. పంచాయతీలో కొత్త భవనాల నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రజల్లో మంచి పేరు వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీరాజ్ జేఈ వెంకటేశ్వరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామకంఠాల్లో నివాసితులకు యాజమాన్య హక్కు



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో అవగాహన కల్పిస్తున్న ప్రశాంత్, రామునాయుడు

కె.కోటపాడు: గ్రామకంఠం స్థలాల్లో నివాసముంటున్న వారికి భూ యాజమాన్య హక్కు కల్పిస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శులు టి.ప్రశాంత్‌కుమార్, ఎస్.రామునాయుడు తెలిపారు. సర్వే ఆఫ్ విలేజెస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రోవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్(స్వామిత్వ) కార్యక్రమంపై శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీఆర్వో, పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో భూ సర్వేలో భూమి యజమానులను గుర్తించి హక్కు పత్రాలు అందిస్తామన్నారు. మండలంలో మొదటి విడతగా గరుగుబిల్లి, ఎ.కోడూరు, వారాడ, సూదివలస, ఆర్.వై.అగ్రహారం, కె.కోటపాడు, గొండుపాలెం, ఆర్.ఎస్.పాలెం, వి.సంతపాలెం, ఆనందపురం, కె.సంతపాలెం, చంద్రయ్యపేట, గొట్లాం గ్రామాల్లో సర్వే చేస్తామన్నారు.

జగనన్న కాలనీల్లో సకల సౌకర్యాలు

- ఆర్డీవో చిన్నికృష్ణ



పిసినికాడ జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లి రూరల్: జగనన్న కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అనకాపల్లి ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ చెప్పారు. హౌసింగ్ డేను పురస్కరించుకుని పిసినికాడ జగనన్న కాలనీని ఆయన శనివారం పరిశీలించారు. కాలనీలో 54 ఇళ్లు మంజూరు చేయగా ఇప్పటివరకూ వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. 10 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని,వీటిలో ఆరు ఇళ్లలో గృహ ప్రవేశాలు జరిగాయని అధికారులు ఆర్డీవోకు తెలిపారు. కాలనీలో నివసిస్తున్న కుటుంబాలతో మాట్లాడిన ఆర్డీవో వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఇంటి నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం నుంచి బిల్లులు సక్రమంగా అందుతున్నాయో?లేదో? లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. డ్వాక్రా రుణం రూ.35 వేలు మంజూరులో ఏవైనా ఇబ్బందులు ఉంటే చెప్పాలని అడిగారు. ఇళ్లన్నింటికీ ఉచితంగా విద్యుత్ మీటర్లు ఇచ్చారో లేదో తెలుసుకున్నారు. విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని అక్కడ లబ్ధిదారులు కోరగా తక్షణమే దానిని పూర్తి చేయాలని గ్రామ పంచాయతీ అధికారులను ఆర్డీవో ఆదేశించారు.ఇందుకు అవసరమైన డిపాజిట్ మొత్తాన్ని గ్రామ పంచాయతీ నిధుల నుంచి చెల్లించాలని సూచించారు.నేరుగా రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, కాలనీ నుంచి మెయిన్ రోడ్డుకు అంతర్గత రహదారి ఏర్పాటు చేయాలని లబ్ధిదారులు కోరారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణం గడువులోగా పూర్తి అయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయా లని ఆర్డీవో సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.వి. నరసింహారావు,గృహ నిర్మాణ శాఖ ఏఈ మురళి,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్,ఆర్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'పార్టీ బలోపేతానికి కృషి'

దేవరాపల్లి: పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. కాశీపురంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. గొర్రుపోటు రామ్మూర్తినాయుడు, ఎం.ఎం.నాయుడు పాల్గొన్నారు.

నియామకం

మాకవరపాలెం: నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ జిల్లా అధ్యక్షుడిగా కోసూరు గణేశ్వరరావు నియమితులయ్యారు. తామరం గ్రామానికి చెందిన గణేశ్వరరావు ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు.

కరెంట్ అఫైర్స్‌పై దృష్టి పెట్టాలి

అనకాపల్లిటౌన్: ఇంటర్వ్యూలకు హాజరయ్యే విద్యార్థులు కరెంట్ అఫైర్స్, లేటెస్ట్ అప్ డేట్స్ కోసం నిత్యం దినపత్రికలను చదవాలని ఐఎఫ్ఎస్ అధికారి విశ్వాంజలి అన్నారు. స్థానిక 'డైట్ ' కళాశాలలో సివిల్‌సర్వీసెస్ ఉద్యోగాలపై శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన ఆమె మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న విషయాలతోపాటు, ప్రస్తుత పరిస్థితులపై పట్టు సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, కెరియర్ గైడెన్స్ సెల్ కో ఆర్డినేటర్ పల్లా వెంకటమురళి పాల్గొన్నారు.